TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 218 పేజీలు - 08 మంగళవారం 01 జులై 2025

## ఈ మూడు జిల్లాల్లో భారీ వర్షాలు..

**- హెచ్చరించిన వాతావరణ విభాగం..!**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్26:** తెలంగాణలో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఐఎండీ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. సోమవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలు చోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది.బుధవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.







- మంటలు చెలరేగి పదిమంది దుర్మరణం
- వెంటనే సహాయక చర్యలకు దిగిన అధికారులు
- వివిధ ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు చికిత్స

## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో

# భారీ పేలుడు

**తొలి అక్షరం/సంగారెడ్డి,జూన్26:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఉన్న సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమ తునాతునకలైపోయింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9 గంటల సమయంలో సీగాచి కెమికల్స్‌లో పని సాగుతున్న సమయంలో రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోయింది. మంటలు తక్కువ సమయంలోనే పరిశ్రమ మొత్తం వ్యాపించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. అయినప్పటికీ, పలువురు కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు కార్మికులు మంటల్లో సజీవదహనమయ్యారు. మిగతా మృతుల మరణానికి తీవ్ర గాయాలు కారణమయ్యాయని తెలుస్తోంది. శిథిలాల కింద ఇంకా 15 మంది కార్మికులు చిక్కుకుపోయి మిగతావి 2లో

## పాశమైలారం ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

● క్షతగాత్రులకు మెరుగైన వైద్యానికి ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్26:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో పేలుడు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన వెంటనే వివరాలు ఆరా తీసారు. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడి పలువురు మిగతావి 2లో

## విధేయత..సీనియారిటికే ప్రాధాన్యం

● తెలంగాణ బిజెపి సారథిగా రామచంద్రరావు ● అందరినీ కలుపుకుని పోతానని వెల్లడి

● ప్రత్యక్ష ఎన్నికే మేలంటున్న రాజాసింగ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్26:** తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ మేరకు నామినేషన్ వేయాలని పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామచందర్‌రావు నామినేషన్ దాఖలు చేసారు. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతలు తీవ్ర కసరత్తు చేశారు. మిగతావి 2లో

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

☛నక్సల్స్‌లో చర్చలు జరపాలంటే ప్రోత్సహించినట్లా..?

☛అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 30:** కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్ట్‌ల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది' అంటూ్గ ÷ర్ అయ్యారు.శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ మిగతావి 2లో



## నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

**- తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి**


**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూన్ 30:** కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్‌బుకింగ్‌లో నిబంధనల అమలుపై రైల్వేబోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని తెలిపింది. జూలై 1నుంచి ఈ మార్పులు అమలు కానున్నాయని ఇప్పటికే ప్రకటించింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసిన రైల్వేశాఖ.. మిగతావి 2లో

## బనకచర్లకు అనుమతులు ఇవ్వలేం

☛పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించండి

☛ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు ఉన్నాయి

☛కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, జూన్ 30:** పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదిం చడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలిం చింది. అయితే, 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన మిగతావి 2లో

## కర్ణాటకలో సిఎం మార్పు వ్యవహారం

**- అంతా అదిష్టానం చేతిలో ఉందన్న ఖర్గే**



**తొలి అక్షరం/బెంగళూరు, జూన్ 30:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు జరగనుందని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు కట్టబెట్టబోతున్నారని చర్చ మిగతావి 2లో

## ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం

☛క్షతగాత్రులకు హరీష్ రావు పరామర్శ


☛మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 30:** పరిశ్రమల భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోనే పాశమైలారం ప్రమాదం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. పాశమైలారం పరిశ్రమ పేలుడు ఘటనపై మాజీ మంత్రి, హరీష్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. నేపాశమైలారం మిగతావి 2లో

## బిసిలంటేనే కాంగ్రెస్ పార్టీ

☛సిఎం రెడ్డి అయితే..అధ్యక్షుడు బిసి ☛బిజెపి బిసిలను వంచించిందన్న పొన్నం



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 30:** బీజేపీ పార్టీ బీసీల వ్యతిరేకని మరోసారి నిరూపించుకుందని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముగ్గురు బీసీ ఎంపీలు ఉన్నా.. అలాగే అనేకమంది బీసీ సీనియర్ నేతలు ఉన్నా సరే.., అలాగే బీజేపీ అధ్యక్షుడు కావడానికి అన్ని అర్హతలు ఉన్నవారికి అధ్యక్ష పదవి ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో బీసీ ముఖ్యమంత్రి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి కనీసం సభాపక్ష నాయకుడుని కూడా బీసీలకు ఇవ్వలేదని ఆగ్రహించారు. తాజాగా మంత్రి బీసీల విషయమై స్పందిస్తూ.. బీసీల గురించి చర్చను లేవనెత్తారు. అంతే కాకుండా ఆయన బీజేపీ ఓ ఫ్యూడల్ పార్టీ అన్నారు. బీజేపీలో బీసీలకు ఎప్పుడూ న్యాయం జరగలేదు. బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వెయ్యనివ్వకుండా అడ్డుకొని నిరంకుశత్వంగా వ్యవహరించారని అన్నారు. బీజేపీలో బీసీలకు అన్యాయం జరుగుతుందని మిగతావి 2లో

## పాశమైలారం ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో పదిమిది మంది కార్మికులు మృతి చెందారు. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. దీంతో క్షతగాత్రులకు సత్వర వైద్యం అందించాలని సిఎం ఆదేశించారు.

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

(మొదటి పేజీ తరువాయి)

రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ÷ర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎ ల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారం కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

## నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీల అమలు

(మొదటి పేజీ తరువాయి)

జులై 1 నుంచి అమలులోకి తీసుకుని రావాలంటూ అన్ని జోన్‌ల మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అర్ధరాత్రి 12గంటల నుంచి పెంచిన రైల్వే ఛార్జీలు అమలులోకి రానున్నాయి. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500కి.మీ వరకు సాధారణ ఛార్జీలే ఉండనున్నాయి. 501 కి.మీ నుంచి 1500 కి.మీ వరకు టికెట్‌పై రూ.5; 201 కి.మీ నుంచి 2500 కి.మీ వరకు టికెట్‌పై రూ.10; 2501 నుంచి 3వేల కి.మీ వరకు టికెట్‌పై రూ.15 చొప్పున పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కి.మీకు అరపైసా చొప్పున పెంచగా.. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్ ఏసీ) రైళ్లలో టికెట్లపై నాన్ ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ టికెట్లపై కి.మీకు ఒక పైసా చొప్పున పెంచారు. అలాగే, అన్ని రకాల రైళ్లలో ఏసీ అన్ని తరగతులకు కి.మీకు 2పైసలు చొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. రిజర్వేషన్ ఛార్జ్, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు పెంచిన ఛార్జీలు అమలు కావని తెలిపింది.

## కర్ణాటకలో సిఎం మార్పు వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. రాజధాని బెంగళూరులో మీడియా ఈ అంశంపై ప్రశ్నించడంతో ఆయన సమాధానం చెప్పారు. ముఖ్యమంత్రి మార్పు అంశం పార్టీ హైకమాండ్ చేతిలో ఉందని, పార్టీ హైకమాండ్‌లో ఏం జరుగుతుందనే విషయాన్ని ఏ ఒక్కరూ బయటికి చెప్పరని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ విషయంలో చర్య తీసుకునే హక్కు హైకమాండ్‌కు మాత్రమే ఉందని, కాబట్టి విషయాన్ని హైకమాండ్‌కే వదిలేద్దామని చెప్పారు. దీనిపై ఎవరూ అనవసరమైన సమస్యలు సృష్టించవద్దని ఆయన కోరారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు వార్తలు నిజమేనా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఖర్గే పైవిధంగా స్పందించారు. డీకే శివకుమార్ కర్ణాటక సీఎం కాబోతున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌ఏ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం అదే విషయం చెప్పడంచర్చనీయాంశంగా మారింది. మరో రెండుమూడు నెలల్లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని హుస్సేన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం హైకమాండ్ శివకుమార్ గురించే యోచిస్తోందని అన్నారు. డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంది.

## సున్నం చెరువులో ఆక్రమణల తొలగించిన హైడ్రా

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 30:** హైదరాబాద్ నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. ఇక్కడ ఏళ్ల తరబడి అక్రమ నీటి వ్యాపారం సాగుతోంది. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది. రూ.10 కోట్లతో సున్నం చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది.

## పాశమైలారం కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఉండొచ్చని అనుమానించడంవల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. గాయపడ్డ 38 మందిలో 20 మందిని చందానగర్ ప్రభుత్వాస్పత్రికి, మరో 18 మందిని ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే 8 ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు భారీ క్రేన్‌లు, హైడ్రా మిషన్‌లను రంగంలోకి దించారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పూర్తిగా కూలిపోవడంతో సహాయక బృందాలు శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ప్రాణాపాయంగా శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ భవనం నుంచి కేవలం ఆరుగురినే బయటకు తీయగలిగారు. కెమికల్ ఫ్యాక్టరీలో మంటలతో పాటు భారీగా విషవాయువులు విడుదలవడంతో పరిసర ప్రాంతాల్లో ఘాటైన వాసనలు వ్యాపించాయి. స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తమ ఇళ్లలోకి చెదురుమదురుగా చేరుకున్నారు. అప్రమత్తమైన అధికారులు సంఘటనా స్థలానికి ఎవరూ రావొద్దని హెచ్చరించారు. ఈ పేలుడు ఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాం÷-రతికి గురిచేసింది. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్నదానిపై విచారణ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు తర్వాత అసలు ప్రమాద స్థాయి ఎంత పెద్దదో అర్థం కానుంది. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగి పరిశ్రమలో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ ప్రమాదంతో స్థానికులు, కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారిని అక్కడి నుంచి దూరంగా పంపించివేసారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటన స్థలానికి పఠాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మల్టీజోన్ టు ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్ చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## విధేయత..సీనియారిటీకే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్లు బలంగా వినిపించాయి. ఈ క్రమంలో రామచందర్‌రావు పేరును ఖరారు చేశారు. ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇకపోతే గత 40 ఏళ్లుగా పార్టీలో రామచంద్రరావు వివిధ హోదాల్లో పనిచేశారు. విద్యార్థి పరిషత్ నాయకుడిగా, లాయర్‌గా సేవలు అందించారు. ముందునుంచి పార్టీలో ఉంటూ సేవ చేసిన కారణంగా ఆయనను అధ్యక్ష పదవి వరించింది. అంతా కలిసికట్టుగా ముందుకెళ్తాం అని బిజెపి మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు తెలిపారు. బిజెపి పార్టీలో ఆధిపత్య పోరు లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివాద రహితుడుగా అవకాశం ఇచ్చిందని, 40 ఏళ్లుగా పార్టీకి చేస్తున్న సేవను అధిష్టానం గుర్తించిందని తెలియజేశారు. ఇప్పటికే ఆశావాహుల్లో అనేక మంది పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరును జాతీయ నాయకత్వం ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు వెల్లడించారు. ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవికి, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఆది వారం నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ కేంద్రమంత్రి శోభా కరండ్లజే సమక్షంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. రామచందర్‌రావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ స్వీకరించనున్నారు. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన రామచందర్ రావుకే సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. మంగళవారం రామచందర్ రావు పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇదిలావుంటే గోషామహల్ ఎమ్మెల్యే మరోమారు సంచలన ప్రకటన చేశారు. తెలంగాణలో భాజపా అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్ఠానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అధ్యక్షుడిని బూత్ కార్యకర్త నుంచి ముఖ్య నేత వరకు ఓటేసి ఎన్నుకోవాలి. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం. తెలంగాణలో భాజపా అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలి' అని రాజాసింగ్ పేర్కొన్నారు.

## బనకచర్లకు అనుమతులు ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పునకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయపడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబిలిటీ అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది. కాగా, ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి చాలా ఫిర్యాదులు అందాయి. ఈ ప్రాజెక్టును మొదటి నుంచి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. వెంటనే ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఈ క్రమంలో బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఏపీ పంపిన ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ పరిశీలించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన కమిటీ.. అనుమతులు ఇవ్వడానికి తిరస్కరించింది. బనకచర్ల ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రిబ్యూనల్ తీర్పు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతుల కోసం సీడబ్ల్యూసీని సంప్రదించడం తప్పనిసరని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్ట్ గోదావరి ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమంటూ అనేక ఫిర్యాదులు వచ్చాయని కమిటీ వెల్లడించింది.

## ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదంలో గాయపడినవారిని హరీష్ రావుతో పాటు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రావు కలిసి పటాన్ చెరులోని ధ్రువ ఆసుపత్రిని సందర్శించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదం జరిగి ఐదు గంటలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 150 మంది వరకు కార్మికులు ఉన్నారని, అయితే ఇప్పటివరకు 60 మంది ఆచూకీ లభించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అస్పత్రిలో 11 మంది గాయపడిన వారు చికిత్స పొందుతుండగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు. వెంటనే మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని.. దీనికోసం జిల్లాకు చెందిన ఎస్పీ, కలెక్టర్ లను ఫోన్ ద్వారా సంప్రదించి.. పరిస్థితి విషమంగా ఉన్న వారిని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అంతేకాకుండా, ఈ ఘటనలో మరణించిన కార్మిక కుటుంబాలకు తక్షణమే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వంను ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలు తమ బంధువుల ఆచూకీ లేక ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
- 17న రైల్ రోకో కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణ

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 30:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 17న రైల్ రోకో నిర్వహించిన తీరుతామని తేల్చిచెప్పారు. సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన రైల్ రోకో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసి సమాజం, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులు పాస్ చేసిందని గుర్తు చేశారు. ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు వెంటనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకే తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన రైల్ రోకో చేసి తీరుతామని తెలిపారు. రైల్ రోకోకు సింగరేణి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని వెల్లడించారు. బిసిల రిజర్వేషన్ల పెంపు, రైల్ రోకో అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఎంఎల్‌సి కవిత మరోసారి విజ్ఞప్తి చేశారు. ఃంగరేణి కాలరీస్ సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంఎల్‌సి కవిత డిమాండ్ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు సర్వేయర్ కోర్సు పూర్తి చేసి డిజిఎంఎస్ నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంస్థలో ఇంటర్నల్ సర్వేయర్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి సర్వేయర్ కోర్సు పూర్తి చేసిన వారి కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.




## బిసిలంటేనే కాంగ్రెస్ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

మీ పార్టీ నాయకులే వాపోతున్నారు.. దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఇకపోతే, సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమ న్నారు. బీసీల ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ.. ముఖ్యమంత్రి రెడ్డి ఉంటే, టీపీసీసీ అధ్యక్షుడిని బీసీని చేసుకున్నా మన్నారు. మేము ఒకవైపు కులగణన చేసుకొని బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ శాసన సభలో చట్టం చేసుకొని సామాజిక న్యాయం కోసం ముందుకుపోతుంటే.. బీజేపీ మరోసారి బీసీల గొంతు కోసిందని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల కోసం నినాదాన్ని ఎత్తుకున్నారన్నారు. తెలంగాణలో దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు న్యాయం జరిగేది కాంగ్రెస్‌తోనే సాధ్యం అంటూ తెలియచేశారు. గతంలో బీజేపీ అధ్యక్షుడు బీసీ నేత బండి సంజయ్ ఉంటే ఎన్నికల సమయంలో ఆయనను తొలగించి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేసారని గుర్తు చేశారు.

## స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు

- పూర్ణచందర్ అమాయకుడని భార్య స్వప్న వ్యాఖ



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 30:** ప్రముఖ టీవీ చానల్ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నిందితుడు పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడని స్వప్న సంచలన వ్యాఖ్యలు చేశారు. పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందన్నారు. అయితే, వారిద్దరి మధ్య సంబంధం గురించి ముందు తనకు తెలియదన్నారు. వారిద్దరి వ్యవహారం తెలిశాక పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు అరణ్య చేస్తున్న ఆరోపణలు అసత్యమని, అరణ్యను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని భయపెట్టిందని స్వప్న వివరించారు. ఃగా, స్వేచ్ఛ వోటార్కర్ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్‌ను పోలీసులు నిన్న అరెస్ట్ చేశారు. అతడి వేధింపుల కారణంగానే తమ కూతురు మరణించినట్టు చిక్కడపల్లి పోలీసులకు స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ నేపథ్యంలోనే నిందితుడు పూర్ణచందర్ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వేచ్ఛ, నేను స్నేహితులుగా ఉండేవాళ్లం. ఐదేళ్లుగా ఆమె మానసికంగా ఆందోళన చెందుతూ చికిత్స పొందుతుంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. స్వేచ్ఛ ఆత్మహత్యతో నాకు ఏలాంటి సంబంధం లేదని లేఖలో పూర్ణచందర్ పేర్కొన్నారు.

# టీఎంజేఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**• అధ్యక్షుడుగా చంద శ్రీనివాస్ • ప్రధాన కార్యదర్శిగా బేతమల్ల సహదేవ్**







**తొలి అక్షరం/దంతాలపల్లి జూన్ 30:** తెలంగాణ మాల జర్నలిస్ట్ అసోసియేషన్(టి ఎంజెఏ)ద్వితీయ వార్షికోత్సవం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రగతి పబ్లిక్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎంజెఏ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తిరిగి రెండవసారి చందా శ్రీనివాస్ (మహబూబాబాద్),ప్రధాన కార్యదర్శిగా బేతమల్ల సహదేవ్(కురవి), గౌరవ అధ్యక్షులుగా బొడ్డు అశోక్(నెల్లికుదురు), ఉపాధ్యక్షులుగా గాజుల రవి(కేసముద్రం), గండమల్ల రోశయ్య(కురవి), అనపర్తి వీరన్న(దంతాలపల్లి), బేతమల అశోక్(నరసింహుల పేట),వెలిశాల శ్యామ్ (తొర్రురు), సహాయ కార్యదర్శిలు గా బండ రాజ్ కుమార్(మహబూబాబాద్),గండమల్ల రామకృష్ణ( మహబూబాబాద్),మెర్గు సంజీవ(మరిపెడ), కోశాధికారిగా సందా అనిల్(నెల్లికుదురు), అధికార ప్రతినిధి దార్ల భాస్కర్(ఇనుగుర్తి), ప్రచార కార్యదర్శులుగా కొప్పుల శ్రీనివాస్(కురవి), చదల యాకాం తం(నెల్లికుదురు),సలహాదారులుగా గులగట్టు దాసు(దంతాలపల్లి),పల్లె యాకాంతం(తొర్రూర్), చిలువేరు ఉపేందర్( నరసింహుల పేట)ల తోపాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# మండల కేంద్రంలో రిలే దీక్షలు

**• తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి • తెలంగాణ ఉద్యమకారుల మండల ఫోరం అధ్యక్షులు లాలు నాయక్, ఉపాధ్యక్షులు సమ్మయ్య గౌడ్**



**తొలి అక్షరం/నరసింహుల పేట జూన్ 30:** తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల మండలఫోరం అధ్యక్షులు లాలు నాయక్ ఉపాధ్యక్షుడు సంపేట సమ్మయ్య గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు పిలుపుమేరకు, శాంతియుత దీక్షను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మలుదశ ఉద్యమంలో నీళ్లు నిధులు నియామకాలు అంటూ సాగిన పోరాటంలో అనేక మంది ఉద్యమకారులు బలిదానాలు పోరాటాలు చేయడం మూలంగానే తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. 14 సంవత్సరాలు పోరాటం చేసిన ఉద్యమకారులను ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి ఉద్యమకాలను సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా దోపిడికి గురిచేసిందన్నారు. అనంతరం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమాన్ని గుర్తించి పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు మండల కేంద్రాలలో 240 గజాల జాగను నెలకు 25 వేల పెన్షన్ను అందిస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయక కాలయాపన చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై స్పందించి తెలంగాణ మలిదశ ఉద్యమకారుల కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేకూర్చాలని ఆయన కోరారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ఉద్యమకారుల యొక్క సత్తా ఏంటో స్థానిక ఎన్నికల్లో రుచి చూడాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సంఘ నాయకులు ఎండి కాజా. బొమ్మగాని వెంకన్న. తో పాటు 20 మంది ఈ దీక్షలో పాల్గొన్నారు

# ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష

**• తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె చాంద్ సార్**



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 30:** రామన్నపేట మండల కేంద్రంలో గెస్ట్ హౌస్ ఎదురుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు మేరకు రామన్నపేట మండల ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్ష కార్యక్రమం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్ సార్ ఆధ్వర్యంలో జరిగినదిఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనరాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న ముఖ్యఅతిథిగా హాజరైనారుఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు ఈ సభకు అధ్యక్షత వహించగా ఎస్.కె చాంద్ సార్ ఉద్యమకారులకు పూలదండలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించినారు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు.అంజన్న మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలము 25 వేల రూపాయలు పెన్షన్అంశమును మేనిఫెస్టోలో చేర్చినారు తక్షణమే తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పించన్లు ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు.ఎస్.కె చాంద్ సార్ మాట్లాడుతూ రామన్నపేట మండలం అంటే తెలంగాణ ఉద్యమకారులకు పుట్టినిల్లు లాంటిదని నాడు తెలంగాణ ఉద్యమం కొరకు పోరాటం చేసిన వారు నేడు కొంతమంది అమరులు అయినారు వారికి కూడా ప్రభుత్వం వారి యొక్క డిమాండ్లను నెరవేర్చాలనిమండల వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించివారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి ఉద్యమం అనంతరంనష్టపోయిన ఉద్యమకారులకుచనిపోయిన ఉద్యమకారులైననారపాక మల్లయ్యకళింగ రాజు మోటే అంజన్న గడ్డం స్వామి ఏలూరు కుమారస్వామి తదితర కుటుంబాలను గుర్తించి లని తెలిపినారు ఈ కార్యక్రమంలోతెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి నాయకులు రెబ్బాసు రాములుమాట్లాడుతూ రామన్నపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని రామన్నపేటలో 100 పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారుఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నోముల శంకర్ రామన్నపేట మాజీ ఉపసర్పంచ్ ఉద్యమ నాయకులు గంగాపురం యాదయ్య బోగారం మాజీ ఉపసర్పంచ్ ఉద్యమ నాయకులు ఎండి ఇమామ్ సాబ్ ఉద్యమ నాయకులు ఎండి యాకూబ్ఆముదం శ్రీను మేడి కృష్ణతదితరులు పాల్గొన్నారు

# నిరుపేద కుటుంబానికి అండగా ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమం

**• ముఖ్య అతిథిగా హాజరైన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ జూన్ 30:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ లో భాగంగా నెక్కొండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ సిబ్బంది హైమావతి, ఇంటి భూమి పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, కెవి సుబ్బారెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రామారావు శిరీష,గంధం సుజాత, ఈదునూరి దిలీప్, కందిక చెన్నకేశవులు, కందిక వీరస్వామి, కందిక వెంకన్న, కొంగర దినేష్, మిగతా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వరి నారు మడులను, పత్తి పంటలను పరిశీలించిన ఏఓ వినయ్ కుమార్





**తొలి అక్షరం/నర్సింహులపేట, జూన్. 30:** మండలంలోని బక్కతండ, బాసు తండా మరియు జయపురం గ్రామాలలో వరి నారుమళ్ళను సోమవారం మండల వ్యవసాయ అధికారి జి. వినయ్ కుమార్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో వరి నారుమడి దశలో ఉందని, ఈ దశలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలని, గట్లను మరీ వెడల్పుగా కాకుండా సన్నగా చేసుకోవడం వలన ఎలుకలు బెడదను కొంతవరకు తగ్గించవచ్చని తెలిపారు. పొలాన్ని ఎత్తు పల్లాలు లేకుండా సమానంగా చదును చేసుకొని నీరు పెట్టి వారం రోజులు ఆరనివ్వాలి, ఇలా చేయడం వల్ల గత పంట తాలూకా గింజల వలన బెరకులు రాకుండా ఉంటాయి. నారుమడిలో కాండం తొలిచే పురుగు నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 2 మిల్లీలీటర్ల క్లోరోపైరిఫాస్ ను లీటర్ నీటికి కలిపి ఉపయోగించాలి. నారు పీకే వారం రోజుల ముందు ఐదు సెంట్ల నారుమడికి 800 గ్రాముల నుండి 1000 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లాలి. నారుమడి పెంచే సమయంలో అధిక వర్షాలు ఉన్నట్లయితే హెక్సాకొనాజోల్ 2 మిల్లీలీటర్లు లేదా 1 మిల్లీలీటరు ప్రాపికొనజోల్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం వల్ల నారు ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చు అని తెలిపారు. అనంతరం పత్తి పంటను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీను, నెల్లికుర్తి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి చేయూత

**• అందించిన గల్లీ బాయ్స్ సభ్యులు • బాబు జగ్జీవన్ రామ్ యూత్ సభ్యులు**



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 30:** మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులు 14,700 గల్లీ బాయ్స్ 8600 .గ్రామానికి చెందిన నోముల రవి వర్మ (యాదయ్య ) ఇటీవల మృతి చెందారు.వారి కుటుంబానికి చేయూత గా 14700గల్లీ బాయ్స్8600 రూపాయలు వారి భార్య కు బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘంగల్లీ బాయ్స్ సభ్యులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షులు నోముల స్వామి ప్రధాన కార్యదర్శి ముత్యాల శివకుమార్, ఉపాధ్యక్షులు చిప్పలపల్లి స్వామి, నోముల శ్రీరాములు, ముత్యాల సాయిలు, చిప్పలపల్లి లక్ష్మయ్య, నోముల లింగయ్య,నోముల రామలింగయ్య, నోముల సుదర్శన్,నోముల లక్ష్మణ్, చిప్పలపల్లి రవీందర్, నోముల మురళి, చిప్పలపల్లి రాములు,నోముల నరేష్, నోముల యాదగిరి బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులుగల్లీ బాయ్స్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సాటి కార్మికునికి గణేష్ యాదవ్‌కు 80,000 ఆర్థిక సహాయం

**• అండగా మెకానిక్ యూనియన్ • గత కాలంలో కార్ మెకానిక్ షెడ్ అగ్ని ప్రమాదానికి గురి ఈయన కార్మికునికి అండగా యూనియన్**

**తొలి అక్షరం/షాద్ నగర్, జూన్ 30:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఓల్డ్ హైవే రహదారిలో ఉన్న గణ గ్యారేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన ఫరూక్ నగర్ మండల్ బుజ్జి కూడా గ్రామానికి చెందిన గణేష్ యాదవ్ కు సాటి మెకానిక్ యూనియన్ అండా కుటుంబ ఆర్థిక సహకారంగా సాటి కార్మికులు 80,000 ఆర్థిక సహాయం ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ప్రమాదానికి గురయ్యే ఎలాంటి కార్మికులు కైనా మా మెకానిక్ యూనియన్ అండగా ఉంటుందని సహాయ సహకారాలు అందజేస్తామని మానవత్వంతో ధృపంతో ఆదుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్ మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రవణ్, వైస్ ప్రెసిడెంట్, ప్రవీణ్ గౌడ్, షాద్నగర్ నియోజకవర్గం ఆల్ మెకానిక్ మెంబర్స్ పాల్గొన్నారు.



# పన్నెండు చరవాణి స్వీకర్త బాధితులకు వారి వారి చరవాణిలు అందజేత




**తొలి అక్షరం/పాపన్నపేట, జూన్ 30:** రిపోర్టర్ దయానంద్ ఇటీవల పోగొట్టుకున్న 12 చరవాణి స్వీకర్త చేసి బాధితులకు అందజేసినట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఎవరైనా చరవాణి పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్లో సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు. ఇప్పటివరకు 283 చరవాణి స్వీకర్త చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అయితే సి ఈ ఐ ఆర్ వెబ్సైట్ ద్వారా వీటిని స్వీకర్త చేసి బాధితులకు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. కాగా పాపన్నపేట ఎస్సైశ్రీనివాస్ గౌడ్ స్వీకర్త పై ప్రత్యేక దృష్టి సారించి పోగొట్టుకున్న చరవాణి ను పెద్ద ఎత్తున స్వీకర్త చేయడం పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# నిరంతర పోరాట యోధుడు రాంచందర్ రావు

**- భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్**



**తొలి అక్షరం/నర్సింహులపేట,జూన్. 30:** తెలంగాణ భాజపా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామ్ చందర్ రావుకు భాజపా ధార్మిక సెల్ తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నామని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజల సూర్య ప్రకాష్ తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ భాజపా అధిష్టానం చాలా రకాల సమీకరణాలతో పార్టీ నాయకుల సమన్వయంతో రాంచందర్ రావు సేవలను అధిష్టానం గుర్తించి పార్టీ అధ్యక్ష పదవిని ఇచ్చిందని ఆయన తెలిపారు.ఆయన ఎన్నిక పట్ల చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

# జాతీయ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులకు ఘన స్వాగతం



**తొలి అక్షరం/కాజీపేట:** హనుమకొండలోని కోడం కన్వెన్షన్ హాల్ లో వరంగల్ అర్బన్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా వచ్చిన యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఇన్చార్జ్ సయ్యద్ ఖలీద్ మరియు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి లకు మడికొండలో కండువా కప్పి ఘన స్వాగతం పలికిన జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కట్కూరి రేవంత్. కాంగ్రెస్ నాయకులు గొట్టేముక్కుల రమాకాంత్ రెడ్డి, కర్ర హరీష్ రెడ్డి, బస్కే ప్రణయ్, భోగి కృష్ణ, పవన్, రజినీకాంత్, ఉదయ్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల వేలం

**తొలి అక్షరం/పరకాల, జూన్ 30:** ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వివిధ నేరాల పై పట్టుబడిన వాహనాలను జిల్లా ప్రో., ఎక్సైజ్ అధికారి వరంగల్ రూరల్ ఆదేశను ప్రకారం తేదీ.02.7.2025 (బుధవారం ) రోజున ఉదయం 11:00 గంటలకు ప్రో., ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వేలం వేయబడునని, కావున ఆసక్తి కలిగినవారు ప్రో.,ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వాహనం అప్ సెట్ ప్రైస్ పై 50% డిపాజిట్ గా చెల్లించి వేలం లో పాల్గొనవచ్చని పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉద్యమకారులకు సంఘీభావం తెలిపిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 30:** రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన దీక్షకు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపినారు సంఘీభావం తెలిపిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్సిపిఐ మండల నాయకులు ఎర్ర రమేష్ గౌడ్టిఆర్ఎస్ నాయకులుపోష బోయిన మల్లేశం కళ్లెం స్వామి కర్రె శ్రీనుకాంగ్రెస్ పార్టీ నాయకులు గొలుసుల ప్రసాద్బండ లింగంబిజెపి నాయకులు లింగస్వామితెలిపినారు

## నల్గొండ డిసిసి అధ్యక్ష పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలి

- ఎమ్మార్పీఎస్ రామన్నపేట మండల అధ్యక్షులు నోముల చిరంజీవి



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 30:** ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండేటి మల్లయ్య కు డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు గతంలో జడ్పిటిసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు తరువాత నకిరేకల్ పార్టీని బుధ స్కందాలపై మోస్తూ ఎన్నో సేవలు చేశారు గత ఎన్నికల్లో నకిరేకల్ నుండి కాంగ్రెస్ టికెట్ ఆశించారు కానీ జరగలేదు దాంతో అధిష్టానం రానున్న రోజుల్లో సముచితమైన స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు ఇచ్చిన నిర్ణయానికి కట్టుబడి ఉన్నరు ఎస్సీ వర్గీకరణ కోసం పనిచేశారు మూడున్నర దశాబ్దాలుగా తాను కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశారు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొండేటి మల్లయ్య కు డిసిసి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఎమ్మార్పీఎస్ రామన్నపేట మండల అధ్యక్షులు నోముల చిరంజీవి కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుల శాంతియుత దీక్షలు



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని తహసిల్దార్ ఆఫీస్ ముందు రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు ఉద్యమ కారులకు 250 గజాల స్థలం తో పాటు 25000 పెన్షన్ ఇవ్వాలని, ఉద్యమకారులకు హెల్త్ కార్డులు, కోరుతూ ఒక రోజు శాంతి యుత దీక్షలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి సోమారాపు వీరాస్వామి, జిల్లా అధ్యక్షులు ముద్దసాని వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి,మహబూబాబాద్ టౌన్ అధ్యక్షులు ఎండి వహీద్. జిల్లా ఉపాధ్యక్షులు గుంజ హనుమంతు, దిగ్గి గోపాల్, అడిదెల వీరబద్రం, నాయిని శ్రీనివాస్, జానీ, ఎస్.కె దస్తగిరి, కుక్కముడి వెంకన్న, అంబాల కుమార్, తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, కుక్కల ఎల్లయ్య, భీమన పల్లి యాదగిరి, దేంచినాల బ్రమ్మ చారి, బండి యాదగిరి, గుండ్ల బాబు, దుగ్గి రమేష్, మీసాల వెంకటయ్య, దస్తగిరి, దండం వెంకన్న, గంగాధరి బాలరాజు, మహ్మద్ కాశీమ్, షేక్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## వానదుర్గ మాత క్షేత్రం వద్ద జోరుగా మద్యం అమ్మకాలు

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- మూడు పువ్వులు ఆరు కాయలుగా ముడుపులు



**తొలి అక్షరం/పాపన్నపేట జూన్ 30:** వాన దుర్గ క్షేత్రం వద్ద జోరుగా మద్యం అమ్మకాలు జెరుగుతున్న ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నిరేతిన్నటుగా వ్యవరస్తున్నారు. మద్యం మత్తులో యువకులు జీవితాలు చిత్తవుతున్నాయి. భక్తులు ఏడుపాయలకు కోరిన కోరికలు తీర్చు కోవడానికి పలు రాష్ట్రాల నుండి భక్తులు వస్తు వుంటారు. భక్తులు పుణ్యస్నానలు ఆచరించడానికి మంజీరా నాది వద్దకు వెళుతూ వుంటారు. మద్యం మత్తులో మంజీరా నాది వద్ద ప్రాణాలు కోలుపోతుంటారు

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఆకస్మిక తనిఖీ

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్....



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** సోమవారం ఆకస్మిక తనిఖీ గూడూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వైద్యసేవల నాణ్యత, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, రికార్డు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని, స్థానిక ఎం.ఎల్.హెచ్.పి రికార్డుల నిర్వహణ సరిగా లేదంటూ అసహనం వ్యక్తం చేస్తూ భవిష్యత్తు లో పునరావృతం కావొద్దని ఆదేశాలు జారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో జబ్బులు రాకుండా తగు జాగ్రత్తలుతీసుకోవాలని అన్నారు. ప్రజలకు సమయానికి మెరుగైన ఆరోగ్యసేవలు అందించేందుకు ప్రతి ఆరోగ్య కేంద్రం తన బాధ్యతగా పనిచేయాలన్నారు.గ్రామాలలో మెడికల్ క్యాంప్ లను నిర్వహించాలని, తమ ప్రాంతములో ఆశ్రమ పాటశాలలు వుంటే అక్కడి పిల్లలకు వైద్య పరీక్షలు అంధించాలని పేర్కొన్నారు.గర్భిణి స్త్రీల నమోధును 12 వారాలలోపు గానే పూర్తి చేయాలని, హై రిస్క్ గర్భిణి స్త్రీలను ప్రసవం కోసం జిల్లా ఆసుపత్రికి పంపించాలని, వర్షాలు ఎక్కువగా వున్నట్లైతే కాన్పుకు దగ్గరగా వున్న వారిని ముందుగానే ఆసుపత్రికి తరలించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమములో స్థానిక ఆరోగ్య అధికారి డాక్టర్ యమున, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి, కొప్పు ప్రసాద్ స్థానిక ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కొరకు ఆన్లైన్ ద్వారా ధరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎ.రవీందర్ రెడ్డి...

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** మహబూబాబాద్ జిల్లా యందు ప్రభుత్వ జిల్లా పరిషత్ /ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మరియు ప్రదానోపాధ్యాయులు నుండి 2025 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కొరకు ఆన్లైన్ ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలని భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ ఢిల్లీ వారు ఆహ్వానిస్తున్నారు. కావున ఆసక్తి గల ఉపాధ్యాయులు జూలై 13 తేది లోపు http://nationalawardstoteach-ers.education.gov.in website ద్వారా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కొరకు రిజిస్ట్రేషన్ చేసుకొని రెండు ప్రతులను సంబంధిత మండల విద్యాశాఖాధికారి ద్వారా 14.07.2025 సాయంత్రం 5.00 గంటల లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయము మహబుబాబాద్ లో సమర్పించవలెనని జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఎ. రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ /ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మరియు ప్రదానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోగలరని పేర్కొన్నారు. ఎంపిక మార్గదర్శకాల కొరకు పైన ఉన్న websiteను సందర్శించి తెలుసుకోవాలని అన్నారు.

## బయ్యారంలో నేడు జాబ్ మేళా

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు బయ్యారం గ్రామ సెక్రెటరీ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ స్రవంతి ఆధ్వర్యంలో బయ్యారం మండలం గ్రామపంచాయతీ నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు, జాబ్ మేళాలో 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల యువతీ యువకులు పాల్గొనాలని,18 సం.రాల నుండి 35 సంవత్సరాల వయస్సు గల వారికి ఉచిత హాస్టల్ వసతి, ఉచిత శిక్షణ సుమారు రెండు నెలలు ఉంటుంది. అనంతరం శిక్షణ పూర్తి చేసిన వారికి 100% ఉద్యోగ అవకాశాలు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా కల్పిస్తున్నాం.కావున ఆసక్తిగల బయ్యారం మండల యువతీ యువకులు గ్రామపంచాయతీ నందు జరిగే జాబ్ మేళాలో పాల్గొని విజయవంతం చేయగలరు.

## ఎమ్మెల్యే పల్లాని పరామర్శించిన భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేష్



**తొలి అక్షరం/రామన్నపేట జూన్ 30:** ఇటీవల ప్రమాదానికి గురై, శస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్ లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి ని సోమవారం భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేష్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లాని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## రైల్వే మూడవ లైన్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు

- రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరిన ఎమ్మెల్యే డా భూక్యా మురళి నాయక్
- మానుకోటలో సూపర్ ఫాస్ట్ రైళ్లు నిలపాలని కోరిన ఎమ్మెల్యే డా"మురళి నాయక్



**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** మహబూబాబాద్ నియోజకవర్గంలో వానకాలం దృష్టి లో పెట్టుకొని కేసముద్రం మండలం లోని అన్నారం గ్రామంలో అండర్ బ్రిడ్జి మరమ్మతులకు సంబంధించిన పనులు చేయాలని అలాగే దీనితో పాటు మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో రైలు గేట్ మూసివేయడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని దీనికి శాశ్వత పరిష్కారంగా రైల్వే అండర్ బ్రిడ్జి ను ఏర్పాటు చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా"భూక్యా మురళీ నాయక్ రైల్వే డిఆర్ఎం భారతీష్ కుమార్ జైన్ ను కోరారు.హైదరాబాద్ రైలు నిలయంలో ఆయన కలిసి వినతిపత్రంను అందజేశారు.అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ మరియు నియోజకవర్గ జిల్లా హెడ్ క్వార్టర్ కి ప్రధాన పట్టణమైన మహబూబాబాద్ రైల్వే స్టేషన్ నుండి దూర ప్రాంతాలకు ఇక్కడి ప్రజలు భారీగా వెళుతుంటారు. కావున దయచేసి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్ళు జిటి, ఏపీ ఎక్స్ప్రెస్ లు వందేభరత్, రప్తిసాగర్, హింసాగర్ ,సంఘమిత్ర వంటి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్ళు నిలపాలని కోరగా దానికి సానుకూలంగా స్పందించి మహబూబాబాద్ లో ఆల్ట్ చేయడానికి అనుమతికి పామిస్తాను అని హామీ ఇచ్చారు.అంతేకాకుండా వానాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకూ రైల్వే సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.ఎమ్మెల్యే వినతికి ఆయన స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.



## కోరటికల్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా కందటి దశరథరెడ్డి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్గా కందటి దశరథరెడ్డిని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా చిన్నం యాదగిరి, పన్నాల ఎల్లారెడ్డి, కట్టెకోల చిన్న యాదయ్య, చామకూర వెంకటయ్య, చిన్నం ముత్యాలు, బస్వ శంకరయ్య, చుంచు చంద్రయ్య, రంగు వెంకటయ్య, లగ్గాల శంకరయ్య, వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మెన్ చుంచు మల్లయ్య, శ్రీరాముల భవనాఋషి, బుడిగె వెంకటయ్య, చామకూర వెంకటయ్య, తాజా మాజీ ఉపసర్పంచ్ చిరబోయిన స్వామి యాదవ్, మామిడి నర్సిరెడ్డి, కోల నరేష్, చుంచు బాలరాజు, చుంచు నాగరాజు, రంగు మల్లయ్య, జోగు నర్సయ్య , చుంచు నర్సయ్య, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, కొమురెల్లి మల్లారెడ్డి, పాల సంఘం సంఘం సెక్రెటరీ గజ్జెల్లి వినయ్, మబ్బు సోమయ్య, లగ్గాల నరహరి, బెజ్జరబోయిన మురళి, రంగు వెంకటయ్య, చిన్నం లక్ష్మయ్య, ఎలిమినేటి యాదగిరి, సయ్యద్ అజ్జు ,తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్లర్ ఆఫ్ ది క్లబ్ అవార్డు అందుకున్న డా.ఎంపల్ల బుచ్చిరెడ్డి

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** సికింద్రాబాద్ కొంపల్లిలో జరిగిన 2024-25, 3150 రోటరీ జిల్లా రోటరీ అవార్డుల ఫంక్షన్లో ప్రతిష్టాత్మకమైన ఫీల్లర్ ఆఫ్ ది క్లబ్ అందుకున్న డా. ఎంపల్ల బుచ్చిరెడ్డి(అధినేత కేపాల్ బోన్స్ సెట్టింగ్స్ సెంటర్ ఔషపూర్)మాజి అధ్యక్షులు రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరికి 3150 జిల్లా గవర్నర్ శరత్ చౌదరి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంలో గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, కొక్కలకొండ నిమ్మయ్య,ఫకీర్ కొండల్ రెడ్డి, కరిపే నర్సింగ్ రావు, ఎండి అనిఫ్ మేమన్, కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి, పలుగుల ఆగేశ్వరరావు, డా. సుమంత్ రెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలియజేసినారు.



## కూరెళ్లలో కాంగ్రెసు నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరిక

- మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి సమక్షంలో చేరిక



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ పిఏసిఎస్ డైరెక్టర్ నార్కెట్పల్లి మల్లమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నార్కెట్పల్లి స్వామి సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి సమక్షంలో మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఉప్పలయ్య యాదవ్ చొరవతో బిఆర్ఎస్ పార్టీలో చేరటం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి, సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి,పిఏసిఎస్ డైరెక్టర్స్ పుట్ట నిర్మల నర్సిరెడ్డి, మల్లెల రాంచంద్రం, వనం యాదయ్య, కూరెళ్ల శ్రీరాములు, ఎండీ మహబూబ్, కూరెళ్ల గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుకల స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్, బిఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు ప్రతికంఠం శాంతన్ రాజు, ఆలేరు నియోజకవర్గ బిఆర్ఎస్వీ నాతి మల్లికార్జున్ గౌడ్, గట్టు విశాల్ మండల నాయకులు భాషబోయిన నరేష్, పంజాల రాజ గౌడ్, లోడి ప్రదీప్ గౌడ్, కూరెళ్ల మని కుమార్, సింగారం తాజామాజీ ఎంపిటిసి పల్లెర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● డిగ్రీ కళాశాలలో లీగల్ సర్వీసెస్ అధ్వర్యంలో అవగాహన సదస్సు






**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,జూన్ 30:** విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలనీ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం నాడు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎండీ.రహమత్ ఖాన్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ.మజీద్, ప్యానల్ అడ్వకేట్ మామిడి వెంకట్ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ దంతూరి సత్తయ్య, లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్స్పెక్టర్ పి.మల్లయ్య, ఎక్సైజ్ ఎస్ఐ శివ కృష్ణలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. ఇప్పుడు ఉన్న సమాజం మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ తమ వంతుగా వారు మారి పక్క వారిని మార్చే విధంగా ఉండాలని తెలిపారు. చెడు అలవాట్ల వల్ల కుటుంబాలు రొడ్డుపాలు చేయవద్దని, తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకునీ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, కళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ వేంకటేశ్వర రావు, అకాడమిక్ కో ఆర్డినేటర్ జెసి.బాబు, ఎన్ సిసి కో ఆర్డినేటర్ డాక్టర్ రాచమల్ల శ్రీను, అధ్యాపకులు డాక్టర్ వెంకన్న గౌడ్, డాక్టర్ కృష్ణ కౌండిన్య, డాక్టర్ కృష్ణ, డాక్టర్ లక్ష్మి నీలిమ, డాక్టర్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.అనిత, డాక్టర్ రత్నమావిల్య, డాక్టర్ బ్రహ్మం, ఎక్సైజ్, సివిల్ పోలీస్ సిబ్బంది, ఎన్ సిసి విద్యార్దులు, విద్యార్దిని విద్యార్దులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని 35 వార్డులలో ఇందిరమ్మ కమిటీ పేరుతో కమిటీ సభ్యులైన కాంగ్రెస్ పార్టీ నాయకులు డబ్బులు వసూలు చేస్తూ నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా వారి కుటుంబ సభ్యులకు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మరియు వారికి నచ్చిన వారికి, డబ్బులు ఇచ్చిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై మరియు రేషన్ కార్డులు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న నాయకులపై 3,4 రోజులు అవుతున్న సోమవారం రోజు వరకు కూడా భువనగిరి శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోనందున మరియు ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు సీకు మరియు ఉచిత ఇసుక ఇస్తామని మంత్రులు తెలియజేసి ఇక్కడ ఇందిరమ్మ ఇండ్లు మొదలైనప్పటికీ ఎక్కడ కూడా వారికి ఇవి అందడం లేదని వీటికి నిరసనగా సోమవారం రోజు భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ పట్టణ మరియు మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు జాయింట్ కలెక్టర్ కి ఇందిరమ్మ ఇండ్లలో జరిగిన అవినీతిని విచారించి పేద ప్రజలకు మరియు నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగాలని అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఇందిరమ్మ కమిటీలను రద్దుచేసి ప్రభుత్వ అధికారుల చేత లబ్ధిదారులను నిర్ణయించాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర జిల్లా పట్టణ మరియు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# 22వ వార్డులో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన చేసిన షాద్ నగర్ ఎమ్ఎల్ఏ వీర్లపల్లి శంకర్

**తొలి అక్షరం/షాద్ నగర్, జూన్ 30:** షాద్నగర్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు భగత్ సింగ్ కాలనీలో సోమవారం రోజు షాద్ నగర్ స్థానిక మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నడికుడ సరిత యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో 7లక్షల 50,000 వేల మున్సిపల్ నిధుల తో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కొబ్బరికాయలు కొట్టి సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. షాద్నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత, షాద్నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అగునూరి విశ్వం, మున్సిపల్ ఏఈలు రాయుడు, సాయి, కాంగ్రెస్ పట్టణపార్టీ అధ్యక్షులు చెన్నయ్య ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు బస్వం అప్ప, తిరుపతిరెడ్డి, బాలరాజ్ గౌడ్, నడికుడ యాదగిరి యాదవ్, పెద్దరాజు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, శ్రీశైలం గౌడ్, మాధవులు, జమ్రుద్ ఖాన్, అర్జున్ లక్ష్మణ్, శ్రీధర్, రోమియో రమేష్, విప్పల వెంకటేష్, నరసింహులు యాదవ్, కింది భాయ్ మహేందర్, బీరప్ప, శ్రీనివాస్, నరసింహ, మంగలి సురేష్, విజయ్, కాలనీవాసులు వర్కల నరసింహులు, సిపిఐ శ్రీను ప్రవీణ్ కుమార్, కృష్ణారెడ్డి, ఆర్పి అనురాధ, సరోజన, మైసమ్మ కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# తడి, పోడి చెత్త వేరు చేసే విధానంపై, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ మరియు అదనపు కలెక్టర్ సూచన మేరకు 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున 9వ వార్డులో తడి మరియు పొడి చెత్తను వేరు చేయుటకు అవగాహన కల్పించడం జరిగింది మరియు కొత్తగా ఇంటి నెంబర్లు విధించిన ఇండ్లకు భువన్ సర్వే చేయడం జరిగినది మరియు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించినైనది. అనంతరం ఏడవ వార్డులో మంతపురి రోడ్డు హైస్కూల్ ప్రహరీ గోడ ప్రక్కనగల మురికి కాలువ పూడిక తీయడం జరిగినది. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, వార్డ్ ఆఫీసర్లు, ఆర్పీలు మరియు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొనడం జరిగింది.

# బయ్యు అంజయ్య10వ వర్ధంతి సందర్భంగా డప్పు కళాకారులకు 25 డప్పులు అందచేత



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సాయిగూడెం గ్రామంలో బయ్యా జ్ఞానేందర్ నాన్న కీ,,శే,,బయ్యు అంజయ్య 10వ వర్ధంతి సందర్భంగా సాయిగూడెం గ్రామంలోని ఎస్సీ సోదరాలకు 25 డప్పులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయిగూడెం ఎస్సీ సంఘ సభ్యులు, ఎస్సీ సంఘం అధ్యక్షులు, ముద్దెపాక లక్ష్మియ్య, కిష్టయ్య, గోపయ్య, శంకర్, శేఖర్, గడిపే యాదేలి ,సంగి నర్సయ్యా, అంజయ్య, గ్యార జానూ, సురేష్, ముద్దేపక కిష్టయ్య, సురేష్, కరుణాకర్, రమేష్ ,బాను, నరేష్, సురేష్ ,ప్రవీణ్, శాంతి కుమార్, అనిల్ మరియు గ్రామస్తులు, సాయిగూడెం కాంగ్రెస్ నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు నల్లమాసా రమేష్, ఉప అధ్యక్షులు గ్యార సురేష్, చింతకాయల శ్రీనివాస్, ఉదరి ఆంజనేయులు, బొడ్డు సతయ్య, నల్లమాసా కృష్ణ, శ్రీరామోజు రమేష్, బొడ్డు మల్లేష్, గోవిందు మల్లేష్, గంగాధరి పరమేష్, భయ్య వెంకటేష్,ఎండీ జావీద్, భీమగాని సాయిరాం, సాయిగూడెం గ్రామస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ చేసే ప్రజా పోరాటాలకు మద్దతు ఇవ్వండి

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జిల్లా కార్యదర్శి ఎండీ జాహాంగీర్




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల మండలం సోమవారం రోజున మండల జనరల్ బాడీ సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎండి జాహాంగిర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల సాధన కోసం ప్రజా పోరాటాలు నిర్వహించాలని ప్రజా సమస్యల పరిష్కారమయ్యేంతా వరకు పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చౌటుప్పల మండలంలోనీ 26 గ్రామపంచాయతీలు 26 గ్రామాలలోని ప్రతి వార్డులో ప్రజలను కలిసి ఇంటింటి సర్వే ద్వారా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం డివిజన్ మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ప్రజా సమస్యల పరిష్కారం కొరకై పోరాడాలని అన్నారు. అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు పెన్షన్లు వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్లు మహిళలకు 2500 ఇవ్వకపోవడం వలన ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో మండలంలో ప్రతి సమస్యను గుర్తించి వాటి సాధన కోసం జరిగే ప్రజా పోరాటాలలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు,గడ్డం వెంకటేశం ,మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొజ్జ బాలయ్య, తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, కొండే శ్రీశైలం, చేన్నబోయిన వెంకటేశం, జక్కిడి దేవేందర్ రెడ్డి, చెరుకు లక్ష్మమ్మ, ఏ సంజీవ, సీనియర్ నాయకులు జక్కిడి రాంరెడ్డి, శాఖా కార్యదర్శులు రత్నం శ్రీకాంత్, జక్కిడి రమణారెడ్డి, బాలగోని బాలరాజు, కొంతం శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల మహేష్, బి నరేష్, ఇటబోయిన శేఖర్, నేరేడు మహేష్, జక్కిరెడ్డి బాల్ రెడ్డి, యాట బాలరాజు, కస్తూరి లింగస్వామి, కృష్ణారెడ్డి, అంజయ్య ,తదితరులు పాల్గొన్నారు.



# జాబ్ మేళ

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** మహబూబాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో, శ్రీ రైతు మిత్ర ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, మహబూబాబాద్ కంపెనీలో అర్హత కల్గిన స్త్రీ/పురుష అభ్యర్దులకు ఉద్యోగవకాశాలను కల్పించుటకు తేది: 02.07.2025 న జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు 20 నుండి 32 సంవత్సరాలు(పురుషులు మరియు మహిళలు) వయసు కలిగి SSC నుండి ఏదైనా డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగ అభ్యర్థులు కంపెనీలోని సేల్స్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పోస్టులకు అర్హులని అన్నారు.అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్దులు తేది: 02.07.2025 న ఉదయం 10.30 గం. ల నుండి మద్యాహ్నం 2.00 గం.ల వరకు జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం లో జరుగు జాబ్ మేళాకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని అన్నారు.మరిన్ని వివరాలకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు 9848042451, ఆఫీస్ నెం.9951 523646 సంప్రదించి వివరాలు పొందవచ్చునని పేర్కొన్నారు.

# తాజ్ పూర్ పాఠశాలలో ఉప్యాయుడు మాటూరి రాజుకి ఘనంగా పదవి విరమణ సన్మానోత్సవం

- ముఖ్యఅతిథిలుగా గ్రంధాల చైర్మన్ అవెజ్ ,మండల ఎంఈఓ నాగవర్ధన్, సామాజిక వేత్త డా. ర్యాకల శ్రీనివాస్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మాటూరి రాజు పదవి విరమణ మహొూత్సవాన్ని ఘనంగా నిర్వహించిన పాఠశాల ఉపాద్యాయులు మరియు విద్యార్థులు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ మరియు విద్యాధికారి ఎం ఈ ఓ నాగవర్ధన్ రెడ్డి, డా. ర్యాకల శ్రీనివాస్ హాజరైయ్యారు.పాఠశాల శాశ్వత దాత డా. ర్యాకల శ్రీనివాస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సొంత నిధులతో నోట్ పుస్తకాలు, పెన్స్, పెన్సిల్స్, రబ్బర్స్ మరియు కాంపస్ బాక్సులు పంపిణీ చేసారు.పలువురు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా రాజు తన బోధనను పాఠశాల విద్యార్థులకు అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని, వారు ఎంతో మంది విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిద్రండ్రులు, పార్టీలకతీతంగా నాయకులు పలువురు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



**తొలి అక్షరం/వరంగల్, జూన్ 30:** ఆర్యవైశ్య సంఘం సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు.ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ సంఘం సమస్యలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి దృష్టికి తీసుకురావడం జరిగింది వెంటనే స్పందించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమస్యలు విని తెలుసుకొని అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు.వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు, ఆర్యవైశ్య అధ్యక్షులు గట్టు మహేష్ బాబు, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు,కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,మహిళా నాయకులు, యూత్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగాధర పోలీస్ స్టేషన్ ఎఎస్సై కిష్టయ్య పదవీ విరమణ

**తొలి అక్షరం/గంగాధర, జూన్ 30:** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు గంగాధర పోలీస్ స్టేషన్ లో గత కొన్ని నెలలుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ కిష్టయ్య తన పదవి విరమణ చేస్తున్న సందర్భంగా గంగాధర ఎస్సై వంశీ క్రిష్ణ పోలీస్ స్టేషన్ లో కిష్టయ్య కి తన కుటుంబ సభ్యులు, మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది సమక్షంలో ఘనంగా సత్కరించారు,ఈ సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ కిష్టయ్య తన 38 సంవత్సరాల సర్వీసులో పోలీస్ డిపార్ట్మెంటుకు ఎన్నో సేవలు అందించారు. పదవి విరమణ తర్వాత కూడా తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలి అని కోరుకుంటూన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వంశీ క్రిష్ణ మరియు కుటుంబ సభ్యులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.







# వెలివాడను చేరదీసి.. అక్షరాన్ని అక్కున చేర్చి..

**● కష్టజీవుల పిల్లలను అక్షరాల వైపు నడిపించిన ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" ● ఆటోలో స్వయంగా కూర్చుని పిల్లలను పాఠశాలకు చేర్చిన ఎమ్మెల్యే శంకర్ ● సిండికేట్ కాలనీలో దేవగిరి సంచార జాతుల పిల్లలకు భవిష్యత్తు ● స్వయంగా పిల్లలను ఆటోలో తీసుకువెళ్లిన ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్".. ● ఫరూక్ నగర్ ఎంఈఓ మనోహర్ కృషితో పేద పిల్లలకు విద్య**

**తొలి అక్షరం/షాద్ నగర్, జూన్ 30:** ఆకలితో అలమటించడం తప్ప అక్షరం నేర్చు కోవడం తెలియని పిల్లలు.. అక్షరాల వైపు తమ పిల్లలను ఎలా నడిపించాలో కూడా తెలియని తల్లిదండ్రులు.. అలాంటి కడుపు పేద జీవులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా కలుసుకున్నారు.. తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి చేర్చారు. స్వయంగా ఆటోలో పిల్లలతో పాటు కూర్చుని బడిదాకా ప్రయాణం చేశారు. షాద్ నగర్ పట్టణంలోని సిండికేట్ కాలనీలో సోమవారం కనిపించిన దృశ్యం ఇది. ప్రభుత్వ బడిని ప్రతి ఒక్కరికి చేరువచేసి చదువు చెప్పించాలన్నది అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం. అందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనంతగా బడికిరాని పిల్లలను బడికి పంపించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కుగా నిరుపేద పిల్లలను బడికి దగ్గర చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా సిండికేట్ కాలనీలో వెలివాడ పేరిట గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేద జీవులను ఎమ్మెల్యే స్వయంగా కలుసుకున్నారు. అక్కడ బడికి రాని పిల్లలు, యాచకులుగా, పాత ఇనుప సామాన్లు, సీసాలు ఏరుకునే పిల్లలు ఉన్నారని గుర్తించారు. వారిని బడిలో చేర్పించాలన్న ఆలోచనతో తల్లిదండ్రులతో మాట్లాడి 25 మంది పిల్లలను ఆర్టీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చేర్చారు. ఎంఈఓ మనోహర్ కూడా ఈ విషయంలో భాగస్వాములయ్యారు. బడికిరాని పిల్లల విషయంలో ఆయన కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం విశేషం. **చదువే భవిష్యత్తు..** చదివే ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తును ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలే ఆణిముత్యాలు గా రూపొందుతారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చదువులకు చాలా ప్రాధాన్యతనిస్తున్నామని, చిన్నపిల్లలు ఇకనుంచి పనులు చేయకుండా బడికి మాత్రమే వెళ్లేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, వారి తల్లిదండ్రులతో కూడా మాట్లాడతామని ఆయన పేర్కొన్నారు. ఏకీకృత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలన్నీ చదువులను బాగు చేయాలనే ఉద్దేశంతోనే చేపడుతున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పటిష్టంగా ఉంటే మధ్యతరగతి వర్గాలు కూడా అక్కడికే వస్తారని, ఫలితంగా వారి మీద ఫీసులు భారం చాలావరకు తగ్గుతుందని ఎమ్మెల్యే అన్నారు. బడికిరాని పిల్లలు ఎవరు దృష్టిలో ఉన్న తనకు సమాచారం ఇస్తే బడిలో చేర్పిస్తానని ఆయన అన్నారు. నిరుపేద కుటుంబాలలో ఉండే పిల్లలు చదువుకుంటేనే వారికి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బడిబాట కార్యక్రమానికి సహకరించిన ఎంఈఓ మనోహర్ తదితర సిబ్బందిని ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.

## మృతుని కుటుంబానికి నిత్యవసర సరుకుల అందజేత

**తొలి అక్షరం/చిట్యాల, జూన్ 30:** చిట్యాల మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే కాగా గ్రామపంచాయతీ స్థాయి ఉద్యోగులు కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యంతో కూడిన రూ.5 వేల విలువ గల నిత్యవసర సరుకులను అందజేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి అజీర బేగం, ఉపాధ్యాయుడు దశరథం, అంగన్వాడీ టీచర్లు కవిత, రజిత, ఆయా శోభ, సిఏ రాజయ్య, బిపిఎం రామకృష్ణ, జిపి సిబ్బంది రాణి పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల అత్యంత జాగ్రత్త తీసుకోవాలి

**● విద్యుత్తుశాఖ మండల ఏఈ పాండు**



**తొలి అక్షరం/నరసింహుల పేట జూన్ 30:** రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితిల్లో చేయకూడదని వివరించారు. కంటికి కనపడని విద్యుత్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి వైర్లలో కరెంట్ ప్రసారం అవుతుందన్న అవగాహనతో మెలగాలని మండల ఏఈ పాండు అన్నారు సోమవారం తొలి అక్షరంతో ఆయన మాట్లాడుతూ. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా మరియు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు, ప్రమాదకరంగా ఉన్నటువంటివి గమనించిన వెంటనే సంబందిత విద్యుత్ సిబ్బందికి TGNPDCL టోల్ ఫ్రీ నం.1912 ద్వారా తెలియచేయగలరు. ఇండ్లలో బట్టలు ఆరవేసే జి.ఐ దండెము/ వైర్ల వలన విద్యుత్ వైర్ల లో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వలన దండెములకు విద్యుత్ సరఫరా అయ్యి షాక్ గురయ్యే ప్రమాదం ఉందని, కనుక ప్లాస్టిక్ దండెములను ఉపయోగించాలని, తద్వారా విద్యుత్ ప్రసారం కాకుండా విద్యుత్ ప్రమాదాలను నియంత్రించవచన్నారు. అలాగే ఇంటి ముందు రేకులకు కూడా విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. కనుక స్థంభం నుండి విద్యుత్ సరఫరా అయ్యే వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. పశువుల యాజమానులు మేతకు తీసుకువెళ్ళినప్పుడు కరెంట్ ట్రాన్స్ఫార్మర్లు, స్థంబాలు దగ్గరికి వెళ్లకుండా కాపరి వాళ్ళు జాగ్రత్త వహించాలని కోరారు. ఒక వేళా కరెంట్ వైర్లు కింద పడి ఉంటె కాపరి వాళ్ళు గమనించి పశువులను వాటిని తాకకుండా అప్రమత్తం చేయాలనీ కోరుతున్నామన్నారు. ఇంటి వైరింగ్ కు సరైన ఎర్తింగ్ చేయండి మరియు నాణ్యమైన ప్లగ్గులు మరియు సెల్ ఫోన్ చార్జర్లను ఉపయోగించండి. సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడం వలన షాక్ కు గురై చనిపోతున్నారు. దయచేసి చార్జింగ్ బంద్ చేసి మాట్లాడవలసిందిగా వినియోగదారులను కోరడమైనది. ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్ కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోరాదు. షాక్ కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడడమే సరియైన పరిష్కారం. వినియోగదారుల గృహాలలోని నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్ ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వలన విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా రైతు సోదరులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం నాణ్యతలేని వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున, కరెంటు మోటార్లను కాని, పైపులను కాని, ఫుట్ వాల్వులను కాని ఏమరపాటుతో తాకకూడదు. వ్యవ సాయ పంపుసెట్లను మరియు స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయవలెను. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జి.ఐ. పైపులు మరియు ఫుట్ వాల్వు తాకడం అత్యంత ప్రమాదకరం. ఎర్తింగ్ అనేది చాలా సులభంగా చేసుకోవచ్చు. రైతులు, వినియోగదారులు స్వయంగా చిన్న మరియు పెద్ద కరెంట్ పనులను సొంతంగా చేసుకొని నిండు ప్రాణాలు కోల్పుతున్నారని, చాల బాధాకరమని, అర్హత కలిగిన ఎలెక్ట్రిషియన్ తో పనులు చేసుకోగలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ కంచెల వలన రైతులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కావున రైతులు అప్రమతంగా ఉండాలని, ఎవరైనా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని కోరుతున్నాము. విద్యుత్ కంచె ఏర్పాటు చేయడం చట్ట రీత్యా నేరం అని ఆయా రైతులకు తెలుపగలరు. విద్యుత్ సిబ్బంది చేయదగిన పనులు అనగా, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద అధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరుచేయడం, ఎబి స్విచ్లు ఆపరేట్ చేయడం మరియు కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. వ్యవసాయ మోటార్లకు మరియు గృహాలలో నాణ్యత గల, అతుకులు (joints) లేని సర్వీసు వైరును మాత్రమే ఉప యోగించండి. గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బంది లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్ గార్లను సంప్రదించి వారి సేవలను పొందండి. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తిన TGNPDCL టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సంప్రదించాలని కోరారు.

# మళ్లీ పడగ విప్పిన 'గుడుంబా'

**● మళ్లీ గుడుంబా మహమ్మారి పడగ.**

**● విచ్చలవిడిగా గుడుంబా అమ్మకాలు**

**● పట్టించుకోని అధికారులు**

**● బైక్ లపై గుడుంబా సప్లై**






**తొలి అక్షరం/నరసింహుల పేట జూన్ 30:** మళ్లీ పడగ విప్పిన గుడుంబా డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ కొరివి డోర్నకల్ చిన్నగూడూరు. నరసింహుల పేట దంతాలపల్లి మళ్లీ గుడుంబా మహమ్మారి పడగ విప్పుతోంది. నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు ఆంధ్రప్రదేశ్లోని ఒంగోలు, చిత్తూరుల నుంచి పెద్ద మొత్తంలో గుడుంబా దిగుమవుతోంది. ఫలితంగా గత కొద్దిరోజులుగా మహబూబాబాద్ జిల్లాతో పాటు డోర్నకల్ నియోజకవర్గంలోని వ్యవసాయ క్షేత్రాలు, అటవీ ప్రాంతాలు గుడుంబా తయారీకి కేంద్రాలుగా మారుతున్నాయి. అనేక తండాల్లో గుడుంబా విక్రయాలు పెరగడమే ఇందుకు నిదర్శనమని చెప్పాలి. తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ అనంతరం వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం గుడుంబాపై ఉక్కుపాదం మోపింది. గుడుంబా తయారీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతోపాటు వ్యాపారులు, తయారీదారులపై ఎక్సైజ్శాఖ పీడీయాక్ట్ నమోదు చేసింది. దీంతో జిల్లాలో గుడుంబా తయారీ పూర్తిగా బందయింది. అయితే గడిచిన కొద్ది కాలంగా మళ్లీ గుడుంబా పురివిప్పుతోంది. ఆంధ్రా నుంచి ఆంధ్రప్రదేశ్లోని ఒంగోలు, చిత్తూరు నుంచి బెల్లం జిల్లాలోని అన్ని మండలాలలో మండలంలోని పలు గ్రామాలకు ఎక్కువగా సరఫరా అవుతోంది. మరిపెడ మండలంలోని ఎల్లంపేట స్టేజి, నరసింహుల పేట స్టేజ్ లల్లోపెద్దనాగారం శివారు గోపతండ జగ్గు తండా కత్తుల తండ సేవలాల్ గుడి దగ్గర వస్త్రం తండా తో పాటు తండాలు గ్రామాలలో రాత్రి వేళలో పెద్ద మొత్తంలో నల్ల బెల్లం, పట్టిక దిగుమతవుతోందని సమాచారం. అక్కడ బహిరంగ మార్కెట్లో క్వింటా ధర 4వేల రూపాయలుగా ఉంటే ఇక్కడకు అదే బెల్లం క్వింటా రూ. 5,000కు అమ్ముతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక్క క్వింటాపై దాదాపు మూడు రెట్ల లాభాలు ఉండటంతో ఈ వ్యవహారంలో పాలుపంచుకునేవారి సంఖ్య పెరిగిపోతుంది. దీంతో అక్రమ పద్ధతిలో బెల్లం అమ్మకాలు పుంజుకుంటున్నాయి. ఎక్సైజ్, పోలీసు అధికారులు బెల్లం మాఫియాలో ఉన్న ప్రధాన సూత్రదారులను పెద్దగా పట్టించుకోకుండా వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా గుప్పు మంటోంది. **ఉదాసీనత...**ఎక్సైజ్ అధికారుల ఉదాసీనత వైఖరి కారణంగా ఈ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరిపెడ మండలంలోని పలు తండాలు, కేసముద్రం, కురవి, డోర్నకల్, మహబూబాబాద్ మండలంలోని గ్రామాల్లో రోజుకు 2వేల లీటర్ల గుడుంబా వ్యాపారం జరుగుతోందని సమాచారం. పలు గ్రామాలు, గిరిజన తండాలలో గుడుంబా వ్యాపారం జోరుగా సాగుతోంది. గుడుంబా తయారీని మానేసినవారికి పునరావాసం కింద ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థికసాయం అందిస్తోంది. అయినా చాలామందిలో మార్పు రావడంలేదు. గుడుంబా దందా చేస్తే అంతకంటే ఎక్కువే సంపాదిస్తామనే ధోరణితో కొంతమంది తమ తీరును మార్చుకోకపోవడం గమనార్హం. నల్లబెల్లం వ్యాపారులే గుడుంబా తయారీదారులకు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలకాలంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించిన దాఖలాలు తక్కువే. నల్లబెల్లం నిల్వ కేంద్రాల సమాచారాన్ని సేకరించి, ఆయా రహస్య గోదాములను సీజ్ చేసిన సందర్భాలూ అరుదనే చెప్పాలి. **అధికారుల అండదండలు?**బెల్లం, పటిక అమ్మకాల విషయంలో వ్యాపారులకు సంబంధిత అధికారుల అండదండలు పూర్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. ఎక్సైజ్ శాఖ నామమాత్రంగా దాడులు నిర్వహించి చిన్నచితక కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. బెల్లం, పటిక వ్యాపారం జరుగుతున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బెల్లం, పటిక అమ్మకాలను అరికట్టడం తోపాటు గుడుంబాకు కరుగుతున్న బడుగుల జీవితాలను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను పరిశీలించాలి

**● ప్రజలు తమ సమస్యలకై ప్రజావాణి లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**





**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యు అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారీ తో కలిసి గ్రీవెన్స్ లో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం రంగాపురం గ్రామానికి చెందిన లేదల్ల రమాదేవి మహబూబాబాద్ మండలం సింగారం గ్రామంలో గల తన తండ్రి పేరు పైన ఉన్న భూమి ఇతరులకు పేరు మార్పిడి ఎలా జరిగింది, ఏవిధమైన పత్రాలు సమర్పించారో తెలుపగలరని సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా ప్రజావాణిలో కోరారు. తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన సరోజన తను గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న మడిపల్లి శివారులో ఉన్న భూమి ప్రొహిబిటెడ్ భూమి అని చూపిస్తుందని అట్టి దానిని సరిచేయగలరని కోరారు. కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామినికి చెందిన బోడ కవిత తను భర్త ను కోల్పోయి ఒంటరిగా ఎటువంటి ఆధారం లేకుండా జీవిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు రానీయకుండా కొంతమంది ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, తన కుటుంబ పరిస్థితి అలోచించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు. పట్టణంలోని బాబాగుట్ట ఎర్రబోడ్ కాలనీకి చెందిన షేక్ జరీనా తనకు ఖాళీ స్థలం ఉన్నదని, ఇల్లు లేదని ప్రభుత్వం వారు మంజూరు చేసే ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన గొల్లపల్లి రామనాథం తన తండ్రి పేరున ఉన్న భూమి మా ఇతర కుటుంబ సభ్యులు తమకు ఉన్న భూమి కంటే ఎక్కువ భూమి తమ పాస్ బుక్ లో నమోదు చేపించుకొని, ప్రభుత్వం నుండి రావాల్సిన లబ్దిని పొందుతున్నారని అట్టి సర్వే నెంబర్ లను సర్వే చేపించి తనకు రావలసిన భూమి ఇప్పించగలరని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణీ లో వచ్చిన ( 148 ) దరఖాస్తులను వివిధ శాఖ ల అధికారులకు సమస్యల పరిష్కారానికై అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో జెడ్.పి. సీఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, హౌసింగ్ డి.ఈ రాజయ్య, ఏ.డి.సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, డి.ఎస్.ఓ ప్రేం కుమార్, బి.సి, ఎస్.సి, ఎస్.టి,మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డి.డి.గ్రౌండ్ వాటర్ సురేష్, డి.హెచ్.ఓ మరియన్న, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, ట్రైబల్ వేల్ఫేర్ అధికారి దేశీరాం, ఎంప్లాయ్మెంట్ అధికారి రజిత, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్.డి.ఎం.సత్యన్నారాయణ మూర్తి, పెన్షన్ అధికారి శంకర్, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతి జెండా పండుగగా నిర్వహించుకోవాలి

**• ఎస్సీ వర్గీకరణ ప్రకారమే కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి • అన్ని శాఖల్లో ఎస్సీ వర్గీకరణను పకడ్బందీగా అమలు చేయాలి • జాతి జెండా పండుగగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలి • ఆలేరు మండలం మంతపురి గ్రామ శాఖ ఎన్నిక • ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ**

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టంలో పేర్కొన్న విధంగా గ్రూప్ -1, గ్రూప్ -2 , గ్రూప్ - 3 ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో మాదిగ కులస్తుల సమావేశం సీనియర్ తొలితరం నాయకులు కందుల శంకర్ మాదిగ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ " ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో రాజీలేని పోరాటం చేసి ఎమ్మార్పీఎస్ విజయం సాధించిందని అన్నారు. ఈ ఎస్సీ వర్గీకరణలో అన్ని శాఖల్లో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.కానీ ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు దక్కుండ




కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో కేటాయించిన గ్రూప్ -1, గ్రూప్ - 2 , గ్రూప్ - 3 ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని అన్నారు. దాని వల్ల ప్రస్తుతం జరుగుతున్న విద్యా, ఉద్యోగ నియామకాల్లో మాదిగలు నష్టపోతున్నారని అన్నారు. కనుక ప్రభుత్వం ఈ విషయం మీద దృష్టి సారించి ఎస్సీ వర్గీకరణ ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని అన్నారు. అలాగే ఎస్సీ ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగలకు దూరం చేయాలని చూస్తే సహించబోమని అన్నారు. అన్ని విద్యారంగ నియామకాల్లో, అన్ని ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం మొదలైన తరువాతనే మాదిగ జాతికి గుర్తింపు గౌరవం లభించిందని అన్నారు.అందువల్ల ఎస్సీ వర్గీకరణ విజయం తరువాత జరుగుతున్న ఎంఆర్పిఎస్ 32 ఆవిర్భావ దినోత్సవం జూలై 7 న ఘనంగా నిర్వహించాలని , జాతి జెండా పండుగగా భావించి ఎంఆర్పిఎస్ జెండాను ఎగురవేయలని పిలుపునిచ్చారు. మంతపురి గ్రామ నూతన గ్రామ శాఖను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ తొలితరం నాయకులు కందుల శంకర్ మాదిగ, సీనియర్ జిల్లా నాయకులు కందుల నర్సింగ్ రావ్ మాదిగ,కందుల స్వామి మాదిగ, కందుల (నడిపి) స్వామి మాదిగ, గ్యార మధు మాదిగ,కందుల కర్ణాకర్ మాదిగ,కందుల రాజు మాదిగ,కందుల సత్యం మాదిగ, గ్యార భిక్షపతి మాదిగ,కందుల కుమార్ మాదిగ,బొల్లం నర్సయ్య మాదిగ,వెల్దండ రాజు మాదిగ, కందుల శ్రీకాంత్ మాదిగ,గ్యారా తరుణ్ మాదిగ,కందుల రాంచంద్రయ్య మాదిగ,గ్యార యాదగిరి మాదిగ,కందుల చంద్రయ్య మాదిగ,వెల్దండ ఎల్లయ్య మాదిగ,గ్యార పరుశురామ్ మాదిగ,ఏలూరి రవి మాదిగ,గ్యార బాల్ చందర్ మాదిగలు తదితరులు పాల్గొన్నారు. మంతపురి గ్రామ శాఖ అధ్యక్షులుగా కందుల స్వామి మాదిగ,ఉపాధ్యక్షులుగా కందుల(నడిపి) స్వామి మాదిగ,ప్రధాన కార్యదర్శిగా గ్యార మధు మాదిగ, అధికార ప్రతినిధిగా కందుల కర్ణాకర్ మాదిగ,కార్యదర్శిగా కందుల రాజు మాదిగ, ప్రచార కార్యదర్శిగా కందుల సత్యం మాదిగలతో పాటు గ్యార భిక్షపతి మాదిగ, కందుల కుమార్ మాదిగ,బొల్లం నర్సయ్య మాదిగ,వెల్దండ రాజు మాదిగ,కందుల శ్రీకాంత్ మాదిగ,గ్యార తరుణ్ మాదిగ, కందుల రాంచంద్రయ్య మాదిగ, గ్యార యాదగిరి మాదిగ,కందుల చంద్రయ్య మాదిగ,వెల్దండ ఎల్లయ్య మాదిగ,గ్యార పరుశురామ్ మాదిగ,ఏలూరి రవి మాదిగ,గ్యార బాల్ చందర్ మాదిగలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నరపరాజు రాంచందర్ రావుకి అభినందనలు

**• ఎల్పీజీ జాతీయ అధ్యక్షులు పింగళి వెంకటేశ్వరరావు**



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్30:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నరపరాజు రాంచందర్ రావు కి శుభవార్త తెలిసి మేము ఎంతో ఆనందంగా, ఉద్విగ్నంగా ఉన్నాము.మీ సేవా పరాయణత, పార్టీ పట్ల మీకున్న అపారమైన ప్రేమ, నిజాయితీ, నిబద్ధత ఎల్లప్పుడూ మాకు ఆదర్శప్రాయం. మీ దీర్ఘకాల విశేష సేవలకు గుర్తింపుగా, ఈరోజు పార్టీ అధ్యక్ష పదవికి మిమ్మల్ని ఎంపిక చేయడం నిజంగా అప్రతిమ గౌరవం.ఇది కేవలం మీ కృషికి మాత్రమే కాదు, పార్టీ పట్ల మీకున్న అంకితభావానికి దక్కిన ఘన విజయం.మీరు అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఈ శుభ సందర్భంలో, మీ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, సరికొత్త శిఖరాలను అధిరోహిస్తుందని మేము బలంగా విశ్వసిస్తున్నాము. మీ దార్శనికత, కార్యాచరణ పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పటిష్టం చేసి, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపుతుందని ఆశిస్తున్నాము. రాబోయే ఎన్నికల్లో మీ దృఢ సంకల్పం, అద్భుతమైన నాయకత్వ పటిమతో బీజేపీ తెలంగాణలో చారిత్రాత్మక విజయాన్ని సాధించి, అధికారాన్ని చేపడుతుందనే మా ఆకాంక్ష బలంగా ఉంది. ప్రజల ఆశీస్సులు, మీ సమర్థతతో తెలంగాణలో సుపరిపాలన, అభివృద్ధిని మీరు తీసుకొస్తారని మాకు సంపూర్ణ నమ్మకం ఉంది.భగవంతుడు మీకు అశేష శక్తిని, సహనాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ, మీ నాయకత్వంలో పార్టీ మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆశిస్తున్నాము.మీకు మరోసారి హృదయపూర్వక అభినందనలు.

# పౌర హక్కుల దినోత్సవంలో సహపంక్తి భోజనాలు

**• పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో సహపక్తి భోజనాలు చేసిన ఆర్డీఓ క్రిష్ణా రెడ్డి, డెవలప్మెంట్ ఆఫీసర్ శ్యామ్ సుందర్, ఏసీపీ మధుసూదన్ రెడ్డి**

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూన్ 30:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని 6 వ వార్డ్ ఇందిరానగర్ లో ఎంఆర్వో జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో సహపక్తి భోజనాలు ఏర్పాటు చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యాదాద్రి జిల్లా ఆర్డీఓ క్రిష్ణా రెడ్డి మాట్లాడుతూ ఎస్సి ఎస్టీలు తమకు హక్కుగా వచ్చే ప్రతి ఒక్క పథకంపై అవగాహనా చేసుకొని వినియోగించుకోవాలని అన్నారు. మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి జిల్లాలో అనేక మంది ఎస్సి ఎస్టీల పక్షాన నిరంతరం పనిచేస్తున్న డివిఎంసి సభ్యులు దాసరి తిరుమలేష్ ను అభినందించారు.జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఎస్సి ఎస్టీ షెడ్యూల్ కులాలకు ప్రజలు చైతన్య వంతులు అయ్యి అన్ని రంగాలల్లో



రానించాలని అన్నారు.చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇతర కులాల వారు ఎవ్వరైన కుల వివక్షత చూపినట్లు అయితే చట్టపరమైన చర్య తీసుకొని బాధితులకు ప్రభుత్వ పక్షాన పరిహారం కూడా ఇస్తామని అన్నారు. సహపక్తి భోజనాలు ఏర్పాటు చేసిన డివిఎంసి సభ్యులు దాసరి తిరుమలేష్ ను అభినందిస్తూ గ్రామస్తులు అందరితో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. దాసరి తిరుమలేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తాను అనగానే పర్మిషన్ ఇచ్చిన కలెక్టర్ హనుమంతరావుకి ఈ కార్యక్రమం ఆలస్యం అయినప్పటికి వెటింగ్ చేసి సమావేశం ముగిసే వరకు ఉండి మాట్లాడి సహపక్తి భోజనాలు చేసిన ఆర్డీఓ క్రిష్ణారెడ్డికి, షెడ్యూల్ కులాల అధికారి శ్యామ్ సుదర్శన్ కి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డికి, మోత్కూర్ సిఐ వెంకటేశ్వర్లుకి మిగతా అధికారులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో మోత్కూర్ సిఐ వెంకటేశ్వర్లు,ఎంఆర్వో జ్యోతి, మున్సిపాలిటీ కమిషనర్ సతీష్, ఎంపిడిఓ, ట్రైని ఎస్ఐ నోయల్ రాజ్,హాస్టల్ వార్డెన్ రాజాలు బాయి, ఆర్ ఐ సుమన్, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు, ఏఎన్ఎం నాగమణి, ఆయా శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్లు లలిత, రేణుక, గ్రామస్తులు గడ్డం నర్సింహా, జిట్ట సోమయ్య, జంగ నాగయ్య, కందుకూరి ప్రకాష్, ఎర్రవెల్లి నర్సయ్య, దాసరి కనుకయ్య, కందుకూరి బిక్షమయ్య, జిట్ట చింతయ్య, వంగాల రాములు, జిట్ట సాయి కుమార్, దాసరి నరేష్, దాసరి నవీన్ కుమార్, బుశిపాక సతీష్, గడ్డం స్వామి, చిప్పలపల్లి గోవర్ధన్, దాసరి యాదయ్య, బుశిపాక సత్తయ్య, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అధికారులతో సహపక్తి భోజనాలు చేశారు.




# కొత్త పెన్షన్లు విడుదల చేయాలి

**• సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలి..**

**• లెనిన్ నగర్, ఇందిరా కాలనీ, యాదవ నగర్, నరసింహ నగర్ శాఖ మహాసభల్లో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి**

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు లో గల లెనిన్ నగర్, ఇందిరా కాలనీ, యాదవ నగర్, నరసింహనగర్ కాలనీల సిపిఐ శాఖ మహాసభలు బేతమల్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో నిలిచిపోయిన నూతన పెన్షన్లను నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని అన్నారు. గత బిఆర్ఎస్ 2018 తర్వాత ఒక్క నూతన పెన్షన్ కూడా రాలేదన్నారు. వితంతువులు వికలాంగులు వృద్ధులు పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ చూపి నూతన పెన్షన్లను విడుదల చేసి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలన్నీ శివారు కాలనీల ప్రజలకు అందించాలని కోరారు నూతనంగా ఇందిరమ్మ ఇల్లు రాజీవ్ వికాసం రేషన్ కార్డులు పథకాలన్నింటినీ అర్హులందరికీ అందేలా చూడాలన్నారు నిత్యం ప్రజల కోసం ఉద్యమించే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ 14వ మహాసభ జూలై రెండున పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని వందలాదిగా తరలివచ్చి ఈ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 5 6న కొరివి మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మూడవ మహాసభలు జరగనున్నాయని ఈ మహాసభలకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఐదవరోజు బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనసేని సాంబశివరావు హాజరవుతున్నారని అదేవిధంగా ఆరవ తేదీన ప్రతినిధుల సభకు తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్ హాజరవుతున్నారని ఈ మహాసభలన్నిటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, 24వ వార్డు కన్వీనర్ చింతకుంట్ల వెంకన్న, బేతమల్ల శ్రీనివాస్, మార్నేని మోహన్ రావు, బిక్షపతి, సమ్మేటరది, ఆలేటి మహేష్, వల్లెం శ్రీకాంత్, జడల నటరాజ్, పులి యాకయ్య, జన్ని లక్ష్మీనారాయణ, రామ నర్సు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించండి




**• ఎమ్మెల్యేలకు జీతాలు ఇచ్చి విద్యార్థులకు మొండిచేయి చూపించే కాంగ్రెస్ ప్రభుత్వం పై విద్యార్థులు పోరాడండి: కాంపాటి పృథ్వీ పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు**

**తొలి అక్షరం/మహబూబాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు రావలసిన ఫీజుబకాయల విషయంలో స్పందించకుండా విద్యార్థులకు మొండి చేయి చూపిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై విద్యార్థులు రాజీలేని పోరాటానికి సిద్ధపడాలని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు.పి డి యస్ యూ మహబూబాబాద్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం పి డి యస్ యూ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌతమ్ అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. గత మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు రావలసిన ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజుబకాయలను చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని గత కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే నేటి రేవంత్ రెడ్డి సర్కార్ కు పడుతుందని హెచ్చరించారు. నెల నెలా ప్రజాప్రతినిధులకి జీతాలు చెల్లించే ప్రభుత్వం విద్యార్థులకు ఎందుకు మొండి చేయి చూపిస్తుందని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ హయాంలో లేని విధంగా విద్యాసంస్థలు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించబోమని విద్యాసంస్థలు బంద్ పాటిస్తున్నాయని చెప్పినా ఏమాత్రం పట్టింపు లేని రేవంత్ రెడ్డి పాలన ప్రజాపాలన ఏవిధంగా అవుతుందని వారు అన్నారు.ఇంటర్,డిగ్రీ,ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్షిప్ రాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని ఒత్తిడి చేస్తున్నా ప్రభుత్వం నుండి ఏమాత్రం స్పందన లేకపోవడం బాధాకరమని రియంబర్స్మెంట్ పథకాన్ని నిర్లక్ష్యం చేసి భవిష్యత్తులో ఎత్తివేయడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు కొనసాగిస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ ని తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నందీశ్వర్,జిల్లా నాయకురాలు సుహిత, పిడిఎస్యు నాయకులు శ్రావణ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నారపరాజు రామచందర్ రావు



**● సంస్థాగత ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తివారి దిశానిర్దేశంలో పేరు ఖరారు**

**● సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్ సంపూర్ణ మద్దతు**

**● అందరి సమ్మతితో ఎన్నిక జరిపే విధంగా హైకమాండ్ నిర్ణయం**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్30:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచందర్ రావు పేరు ఖరారైంది. నామినేషన్ వేయాలని ఆయనను అధిష్ఠానంఆదేశించింది.దీంతో నేటి మధ్యాహ్నం 2గంటలకు రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేశారు.అధ్యక్ష ఎన్నికకు పెద్దగా పోటీ లేకుండానే అందరి సమ్మతితో ఎన్నిక జరిపే విధంగా హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. నామినేషన్ల స్వీకరణ రాష్ట్ర కార్యాలయంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు ఈ రోజు సోమవారం నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. యిదే రోజుసాయంత్రం 4 గంటల నుంచి 5 గంటలవరకు పరిశీలన, ఉపసంహరణకు అవకాశం కల్పించారు.జూలై 1వ తేదీన అధ్యక్ష ఎన్నిక, ప్రకటన ఉంటుంది.అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో 119 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, 38 జిల్లాశాఖల అధ్యక్షులు, 17 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్గొంటారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశంపై పార్టీ నాయకత్వం ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించింది.రంగారెడ్డి జిల్లా మన్నెగూడ సమీపం లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, సంస్థాగత ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తివారి తదితరులు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు.

**నారపరాజు రాజకీయ ప్రస్థానం నిర్వహించిన పదవులు:** నారపరాజు రామచందర్ రావు తెలంగాణ రాష్ట్ర చెందిన రాజకీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ. నారపరాజు రామచందర్ రావు. బార్ కౌన్సిల్ సభ్యుడు కూడా.1977-80 అధ్యక్ష్యుడు స్టూడెంట్స్ యూనియన్,రైల్వే డిగ్రీ కాలేజీ 1982-85 స్టూడెంట్స్ యూనియన్ కార్యదర్శి,ఉస్మానియా యూనివర్సిటీతొలి రాష్ట్ర కార్యదర్శి భారతీయ జనతా యువ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్ భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ భారతీయ జనతాపార్టీ జాతీయశాఖ 2008 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి 2011-2013 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 2014 సభ్యుడు, బార్ కౌన్సిల్ అఫ్ ఇండియా 2015 - 2021 మాజీ ఎమ్మెల్సీ మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం 2017 అధ్యక్షుడు, హైదరాబాద్ జిల్లా బీజేపీ ఇతర రాజకీయ పార్టీ సేవలు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, ఏబీవీపీ భారతీయ జనతా పార్టీ. **రామచందర్ రావు వ్యక్తిగతజీవిత విశేషాలు ...** జననం1959 ఏప్రిల్ 27 ( 66)జీవిత భాగస్వామి ఎన్.సావిత్రి,సంతానం అముక్త, అవనీష్పూర్వ ఉస్మానియా యూనివర్సిటీవిద్యార్థి.

# ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు






**● రాయపర్తిలో రూ.14.17 కోట్ల గోదాం నిర్మాణానికి శంకుస్థాపన ● కాంగ్రెస్ విజయం ఖాయం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ● రాయపర్తి అభివృద్ధికి పూర్తి సహకారం: వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ● రైతుల సంక్షేమానికి పెద్దపీట ● ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ● కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి ● టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్30:** రాయపర్తి మండల కేంద్రంలో రూ. 14.17 కోట్ల వ్యయంతో, 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణ పనులకు సోమవారం రాష్ట్ర రెవెన్యూ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు. **ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు:** ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నిక ఏదైనా గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆయన నొక్కి చెప్పారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ, అభివృద్ధి ఆగదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత 15 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెడుతూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. రాష్ట్రంలో 8 వేల 19 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను తప్పకుండా నెరవేరుస్తామని, పేద ప్రజలు అందరూ ఓట్లేసి గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. **రైతుల సంక్షేమానికి పెద్దపీట:** ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ధాన్యం నిల్వ చేసుకునేందుకు ఈ గోదాం నిర్మిస్తున్నట్లు తెలిపారు. చెప్పే చరిత్ర బీఆర్ఎస్ ది అయితే, చేసి చూపించే నైజం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదని ఆమె వ్యాఖ్యానించారు. పాలకుర్తి నియోజకవర్గానికి రూ. 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకొచ్చామని ఆమె గుర్తు చేశారు. **రాయపర్తి అభివృద్ధికి పూర్తి సహకారం:** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య మాట్లాడు తూ, రాయపర్తి మండల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. **కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి:** టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. రాయపర్తి మండలంలోని అధికారులు, ప్రజలు భారీ ఎత్తున హాజరయ్యారు. వందలాది మీటర్ల మేర బారులు తీరిన జనం, మహిళల కోలాట నృత్యాలు, కళాకారుల డప్పు వాయిద్యాలు, కార్యకర్తల నినాదాల మధ్య నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిజాయితీ క్రమశిక్షణకు నిలువెత్తు నిదర్శనం కృష్ణమూర్తి

**● సేవా పరాయణుడు కృష్ణమూర్తికి ఘన సన్మానం**


**● హన్మకొండ ఎక్సైజ్ శాఖ ఆత్మీయ వీడ్కోలు**

**● హన్మకొండ ఎక్సైజ్ ఎస్సై కృష్ణమూర్తికి సీఐ దుర్గ భవాని గౌరవం**




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్30:** హన్మకొండ ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు ఎస్సైగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన బి.కృష్ణమూర్తికి సోమవారం శాఖ తరపున ఘన సన్మానం జరిగింది. స్టేషన్ సీఐ జి.దుర్గ భవాని కృష్ణమూర్తిని శాలువా,పూలమాలతో సత్కరించి గౌరవించారు.**నిజాయితీ, క్రమశిక్షణకు నిలువెత్తు నిదర్శనం కృష్ణమూర్తి:** ఈ సందర్భంగా సిఐ జి.దుర్గ భవాని మాట్లాడుతూ....కృష్ణమూర్తి నాలుగు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణతో, నిజాయితీగా, నిబద్ధతతో సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించారని కొనియాడారు.ఆయన సేవలు ఎక్సైజ్ శాఖకు ఎనలేని కీర్తిని తెచ్చాయని పేర్కొన్నారు.యువతరానికి ఆయన ఆదర్శప్రాయులని ప్రశంసించారు.అంకితభావంతో పనిచేస్తే లభించే విజయాలకు కృష్ణమూర్తి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.కృష్ణమూర్తి చేసిన సేవలను అందరూ గుర్తుచేసుకుంటూ, ఆయన భవిష్యత్ జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మానంలో ఎస్సై వెంకన్న,చందు, పలువురు హెడ్ కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్యో నారాయణో హరిః



**● నేడు జాతీయ వైద్యుల దినోత్సవం**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూన్30:** వైద్యో నారాయణో హరిః అన్నది ఆర్యోక్తి. వైద్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడితో సమానం. ఎందుకంటే ప్రాణాపాయం నుంచి మనలను గట్టెక్కించేది అతడే గనుక. మనం భూమి మీద రావడానికి ముందే డాక్టర్ సహాయం అవసరమ వుతుంది. మనం పుట్టి, పెరిగి పెద్దయ్యాక కూడా వైద్యుని సహకారం ఖచ్చితంగా ఉంటుంది. అందుకే వైద్యోనారాయణ హరి అని అంటుంటారు పెద్దలు.. మనకు ఏ చిన్న రోగమొచ్చినా దాన్ని చిటికెలో నయం చేసే ఆపద్బాంధవుడు వైద్యుడే. మనలో ఎవరికైనా ప్రాణాపాయం కలిగినపుడు మన ప్రాణాల్ని కాపాడేం దుకు శాయశక్తులా కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తారు. అంతేకాదు మనలోని మానసిక స్థితిని బట్టి, మన ప్రవర్తనకు తగ్గట్టు వ్యవహరిస్తారు. మనకు ఎలాంటి బాధ కలగకుండా మనకు చికిత్స చేసేందుకు ప్రయత్నం చేస్తారు. మనం వ్యాధి నుండి త్వరగా కోలుకునేలా చేస్తారు. ఒకవేళ మనం వ్యాధి నుండి బయటపడలేని స్థితిలో ఉంటే, మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేందుకు వారి వంతు ప్రయత్నం చేస్తారు. ఇంతటి గొప్ప యోధులని గుర్తు చేసుకునేందుకే డాక్టర్స్ డే జరుపుకుంటారు. అయితే ఈ వైద్య దినోత్సవాన్ని డాక్టర్ బిధన్ చంద్ర రాయ్ జయంతి రోజునే జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ బిధన్ చంద్ర రాయ్‌ను స్మరించు కునేందుకు జులై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవాలని, 1991 సంవత్సరంలో కేంద్రం నిర్ణయించింది. ఆయన ఒక గొప్ప వైద్యుడు, విద్యావేత్త, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. శాసన ఉల్లంఘన ఉద్యమంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. డాక్టర్ బిదన్ చంద్ర రాయ్, పశ్చిమ బెంగాల్‌కు రెండో ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. వైద్య రంగంలో ఎన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. తన జీవితాన్ని వైద్యరంగానికి అంకితమిచ్చారు. జులై ఒకటో తేదీన ఆయన జన్మించారు.. అయితే అదే రోజున ఆయన మరణించడం విశేషం. అందుకే మనదేశంలో ఆయన జ్ఞాపకార్థం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆయన వైద్య రంగంలోనే కాదు, రాజకీయాల్లో చాలా కీలక పాత్ర పోషించారు. 1947 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా కూడా పని చేశారు. 1948 సంవత్సరంలో జనవరి 23వ తేదీన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సామాన్య ప్రజలకు సైతం వైద్యం అందుబాటులో ఉండేందుకు ఆయన ఎంతగానో కృషి చేశా రు. కలకత్తాలో అనేక మెడికల్ కళాశాల లను ఏర్పాటు చేశారు. తను కలకత్తా కార్పొరేషన్ మేయర్ గా ఉన్న సమయ ంలో ఉచిత విద్య, ఉచిత వైద్య సేవలు, మంచి రోడ్లు, విద్యుత్ దీపాలు, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూశారు. బెంగాల్ సిఎం అయ్యాక లా అండ్ ఆర్డర్ పై కూడా పూర్తిగా పట్టు సాధిం చారు. 1961లో తన ఇంటిని కూడా పేద ప్రజల కోసం విరాళం గా ఇచ్చేశారు. అదే ఏడాది అంటే 1961 ఫిబ్రవరి 4వ తేదీన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును ప్రకటించింది.

